క్లుప్తంగా

డాక్టర్‌గా బాధ్యతలు


డాక్టర్ శివ

దొర్నిపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా శివ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన నియామకాల్లో ఆయన దొర్నిపాడు ఎంపిక చేసుకున్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ వైద్యుడిగా పనిచేసిన నాగేంద్ర ఉన్నత చదువుల కోసం వెళ్లారు.

టీచర్లకు సన్మానం


సన్మానం పొందిన టీచర్లు

శిరివెళ్ల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 15 మంది టీచర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం టీచర్లకు హెచ్‌ఎం గోవింద రాజులు ఆధ్వర్యంలో శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. పాఠశాల, విద్యార్థుల విద్యాభివృద్ధికి వారు చేసిన సేవలను కొనియాడారు.

విద్యార్థుల నమోదు వంద శాతం జరగాలి


మాట్లాడుతున్న ఎంఈఓ

శిరివెళ్ల: పాఠశాలలో వంద శాతం విద్యార్థుల నమోదు జరగాలని ఏంఈఓ నాగార్జునరెడ్డి అన్నారు. గురువారం మోడల్ స్కూల్‌లో మండల క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో 6–14 ఏళ్ల పిల్లలు 600 మంది డ్రాపౌట్స్ ఉన్నారని తెలిపారు. టీచర్లు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు కలిసి సర్వే చేయాలని చెప్పారు. ఇంకా నమోదు కాని పిల్లలపై కూడా సర్వే చేయాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, విద్యను అందించాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు పెరగడానికి టీచర్లు కృషి చేయాలని సూచించారు. తల్లిదండ్రులతో మమేకమై ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చూడాలని పేర్కొన్నారు.

ఏపీపీగా నాగరాజేశ్వర్ రెడ్డి



నంద్యాల (వ్యవసాయం): నంద్యాల మూడవ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా సీనియర్ న్యాయవాది శీలం నాగరాజేశ్వర్ రెడ్డి పదవిని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఏపీపీగా మూడు సంవత్సరాల పాటు ప్రభుత్వం తరఫున సేవలందిస్తానని చెప్పారు. తన వంతుగా పేదలకు ఉచిత న్యాయ సహాయం, సహాలను అందజేస్తానన్నారు. బార్ అసోసియేషన్ నాయకులు రాజేశ్వరరెడ్డిని అభినందించి సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు హుసేన్ బాషా, సుబ్బరాయుడు, కృష్ణారెడ్డి సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ


సర్వే పురోగతిపై ఆరా తీస్తున్న ఎంపీడీఓ

శిరివెళ్ల: యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీని గురువారం ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తనిఖీ చేశారు. పంచాయతీలో జరుగుతున్న పనులు, సర్వేలపై ఆరా తీశారు. గ్రామంలో అద్దె భవనంలో కొనసాగుతున్న 2వ సచివాలయాన్ని పంచాయతీ సమీపంలోని విలీన పాఠశాల భవనంలోకి మార్పుపై సన్నాహాలను పరిశీలించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల అదనపు గదులను పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ అయ్యలూరి సుభహాన్, ఈఓ శివలీల, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రేపు అహోబిలం గేట్ వేలం పాట

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలం గ్రామ పంచాయతీ గేట్ వేలం పాట ఈ నెల 28వ తేదీ నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి గురువారం తెలిపారు. 2025–26 ఏడాదికి సంబంధించి వాహనాల గేట్ వసూలు చేసుకునే హక్కుకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తామన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో జరుగుతుందన్నారు. అహోబిలం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వారే అర్హులన్నారు. రూ. 2 లక్షలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని తెలిపారు. హెచ్చు పాటదారుడు పాట పాడిన పూర్తి మొత్తం వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు.

అతిసారంతో జాగ్రత్త!

- వచ్చే నెల 31 వరకు మాసోత్సవాలు
- చిన్న పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలంటున్న వైద్యులు


అతిసారపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గోస్పాడు: వర్షాకాలం ప్రారంభమవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు. వ్యాధుల్లో అతిసార ప్రమాదకరమైనది. నీళ్ల విరోచనాలు ఈ వ్యాధి లక్షణం. పిల్లల్లో వచ్చే డయేరియాకు రోటా వైరస్, పెద్దవాళ్లలో వచ్చే డయేరియాకు నోరో వైరస్‌లు కారణం. ఇవేకాకుండా రకరకాల ఫంగల్ ఇన్ఫెక్షన్లు, బ్యాక్టీరియాలు, జీర్ణ వ్యవస్థ దెబ్బతినటం, ఫుడ్ పాయిజనింగ్ లాంటివి కూడా డయేరియాకు కారణమవుతాయి. డయేరియా సోకినప్పుడు శరీరంలో నీటి శాతం, లవణాలు తగ్గిపోతాయి. దీంతో నీరసిస్తారు. నీళ్ల విరోచనాలు, రక్తం బంకతో వచ్చే విరోచనాలు వచ్చే అవకాశం ఉందని, ఆ సమయంలో శరీరానికి సరిపడా లవణాలు అందించకపోతే డీహైడ్రేషన్ ఎక్కువై పరిస్థితి ప్రమాదకరంగా మారుతుందని వైద్యులు పేర్కొంటున్నారు.

లక్షణాలు..

అతిసార వ్యాధి కలుషితమైన ఆహారం, నీరు తీసుకోవడం, శరీరంలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, తల్లిపాలు లోపించడం ద్వారా పిల్లలకు అతిసార సోకుతుంది. ఎక్కువసార్లు విరేచనాలు కావడం, ఒక్కోసారి కడుపులో నొప్పి, శరీరంలో ద్రవం కోల్పోవడం వల్ల నోరు పొడిబారటం. తక్కువ మూత్ర విసర్జన, చర్మం సాగే గుణం కోల్పోవడం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుందని చెబుతున్నా,రు. పిల్లలు అతి సారంతో బాధపడుతుంటే, వారికి ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్) ఇవ్వడంతో పాటు వెంటనే వైద్యులను సంప్రదించాలి. అతిసార నియంత్రణ మాసోత్సవాలను ఈనెల 16 నుంచి జూలై నెలాఖరు వరకు నిర్వహిస్తున్నారు.

జాగ్రత్తలు..

- చేతులు శుభ్రగా కడుక్కోవడం, పరిశుభ్రత పాటించడం
- బహిరంగ ప్రదేశాల్లో ఆహార పదార్థాలను తీసుకోవడం మానుకోవాలి.
- కాచి చల్లార్చిన నీటిని, శుద్ధిచేసిన మంచినీటిని తాగాలి.
- ఓఆర్ఎస్, ఇతర ద్రవపదార్థాలను తీసుకోవాలి.
- ఆహార పాత్రలపై మూతలు ఉంచుకోవాలి
- నిల్వ ఆహార పదార్థాలను తినకూడదు, వేడి ఆహారాన్ని తీసుకోవాలి
- గోళ్లు పెంచుకోవడం మానుకోవాలి.

సరైన ఆహారం తప్పనిసరి..

తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి, మసాలాలు, నూనెలు ఎక్కువగా ఉన్న ఆహారానికి దూరంగా ఉండాలి. కొబ్బరినీళ్ల లాంటివి తీసుకోవాలి. ఎలక్ట్రాల్ పొడి కలిపిన నీళ్లు, కొబ్బరినీళ్లు, నిమ్మరసం వంటివి తాగితే శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి పొందుతుంది.

వ్యాక్సిన్లు వేయించాలి



పిల్లలందరికీ వ్యాక్సిన్లు తప్పనిసరిగా వేయించాలి. వర్షాకాలంలో చిన్నారులు అతిసారకు గురయ్యే అవకాశం ఉంటుంది. మొదటి ఆరు నెలలు వారికి తల్లి పాలు మాత్రమే పట్టాలి. విరోచనాలు అవుతున్నప్పుడు తల్లిపాలు, ఇతర ద్రావణాలను, అనుబంధ ఆహారాన్ని నిర్విరామంగా ఇవ్వాలి. బిడ్డకు ఆహారం తినిపించే ముందు, వంట చేయడానికి ముందు, బిడ్డ మల,మూత్ర విసర్జకాలను తీసినప్పుడు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. సమీపంలోని వైద్యశాలలో చికిత్స పొందాలి. నీరు, మజ్జిగ, కొబ్బరినీళ్ళు తదితర ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

– డాక్టర్ సుదర్శన్‌బాబు, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్, నంద్యాల

మహిళలకు చట్టాలపై అవగాహనుండాలి


జూనియర్ కళాశాలలోఅవగాహన కల్పిస్తున్న సీఐ

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థినులు, మహిళలు చట్టాల గురించి తెలుసుకోవాలని, మహిళా పోలీసుస్టేషన్ సీఐ జయరాం పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని మహిళా జూనియర్ కళాశాలలో సైబర్ క్రైమ్, చైల్డ్ మ్యారేజెస్, టీచింగ్, ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. శక్తి యాప్‌ను ప్రతి విద్యార్థి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. యాప్‌వల్ల కలిగే లాభాలను వివరించారు. మిస్సింగ్ కేసులు, ఫ్యామిలీ కౌన్సెలింగ్, పోలీసు స్టేషన్‌లో లీగల్ కేసుల్లో సహాయం చేయడాన్ని తెలియజేశారు. విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై మహిళా కానిస్టేబుల్ చూపించారు. హెకానిస్టేబుల్ మద్దయ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

జగజ్జననీ మాతకు సారె సమర్పణ


జగజ్జననీ అమ్మవారికి సారె తీసుకొస్తున్న వాసవి మహిళా మండలి సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక జగజ్జననీ నగర్‌లో వెలసిన శ్రీ జగజ్జననీ అమ్మవారికి ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని మొదటి రోజు భక్తులు సారే భక్తి శ్రద్ధలతో సమర్పించారు. ఉదయాన్నే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి, పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి భక్తులు తీసుకొచ్చిన చీర, సారెను మేళతాళాలతో ఊరేగింపుగా అమ్మవారికి సమర్పించారు. శ్రీ వాసవి మహిళా మండలి అధ్యక్షులు ఇందుమతి, శోభారాణి ఆధ్వర్యంలో అమ్మవారికి చీర సారె సమర్పించారు. శ్రీ దుర్గా ఫ్రెండ్స్ యూనిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.


ఆలయం వద్ద ఆళ్లగడ్డ కళాకారుల నృత్య ప్రదర్శన

మాదక ద్రవ్యాలతో అనర్థాలు అనేకం


మాట్లాడుతున్న నాగజ్యోతి


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): మాదక ద్రవ్యాల వినియోగంతో అనేక అనర్థాలు కలుగుతాయని జిల్లా చైల్డ్ ప్రొడక్షన్ సభ్యులు నాగజ్యోతి, ఓబులమ్మ, లక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక బస్టాండ్ సమీపంలో నున్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు, అనారోగ్య సమస్యలను వివరించారు. అనంతరం విద్యార్థినులతో పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం చంద్రలేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

గోస్పాడు: మాదక ద్రవ్యాల వాడకం ప్రాణాంతకమని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత అన్నారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులతో మాదక ద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి చదువులో రాణించాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

ఆళ్లగడ్డ: మాదకద్రవ్యాల వినియోగానికి విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రధాన రోడ్డు మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టి అక్కడ మానవహారంగా ఏర్పడి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. తెలిసీతెలియని వయస్సులో మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే ఉజ్వల భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. మత్తుపదార్థాలు తీసుకోవడం, సరఫరా చేయడం చేస్తే 20 ఏళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. సీఐలు మురళీధర్‌రెడ్డి, యుగంధర్, ఎస్ఐలు నగీన, జయప్ప, తహసీల్దార్ రత్నకుమారి పాల్గొన్నారు.


ఆళ్లగడ్డ: ర్యాలీలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రమోద్


రుద్రవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది


ఉయ్యాలవాడలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్

రుద్రవరం: యువత డ్రగ్స్ జోలికెళ్లవద్దని రెవెన్యూ సిబ్బంది సూచించారు. రుద్రవరంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ మత్తులో పడి విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పేర్కొన్నారు.

ఉయ్యాలవాడ: మత్తుకు చిక్కితే యువత భవిష్యత్ నాశనమవుతుందని తహసీల్దార్ సువర్ణాదేవి అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయం సమీపంలో తహసీల్దార్, డీటీ ప్రసాద్‌బాబు, ఏఎస్ఐలు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సిబ్బంది మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఒకప్పుడు పెద్ద నగరాలకే పరిమితమైన ఈ వ్యసనం నేడు గ్రామాలకు విస్తరించడం ఆందోళన కలిగించే విషయమన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి


మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి అమ్మన్నరాజ

నంద్యాల (వ్యవసాయం): యువత మత్తుకు దూరంగా ఉండాలని మూడవ అదుపు జిల్లా జడ్జి అమ్మన్నరాజ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో స్థానిక బుడగ జంగాల కాలనీలోని ప్రజలకు మండలాలీగల్ సేల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడటం వల్ల అనేక దుష్ప్రయోజనాలు కలుగుతాయని వాటికి దూరంగా ఉంటే మంచిదని చెప్పారు. మత్తు పదార్థాలు అమ్మడం, అమ్మేవారిని ప్రోత్సహించడం నేరమని మూడవ పట్టణ సీఐ ఇస్మాయిల్ తెలిపారు. న్యాయవాదులు ఖలీల్, రమేష్, కృష్ణారెడ్డి, వైవి రమణారెడ్డి, శ్రీదేవి మద్దిలేటి, లోక్ అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

నంద్యాల(న్యూటౌన్): మున్సిపాలిటీ ఇంజినీరింగ్ కార్మికులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట రెండో రోజు గురువారం రిలే దీక్షలు కొనసాగించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటలింగం, నాగరాజు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 15 రోజుల క్రితం రాష్ట్ర మున్సిపల్ శాఖమంత్రి నారాయణకు సమస్యలను వివరించామన్నారు. జీవోనం.36 ప్రకారం కార్మికులందరికీ రూ.26వేలు ఇవ్వాలని, గ్రేడ్‌ల ప్రకారం అయితే రూ.24వేలు ఇవ్వాలన్నారు. రిటైర్ అయిన వారందరికీ రూ.75వేలు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, మృతి చెందిన కార్మికులకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని దీక్షలో పాల్గొన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు భాస్కరాచారి, రామాంజనేయులు, రంగనాథ్, బాలదుర్గన్న పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డాక్టర్

రుద్రవరం: మలేరియాపై అప్రమత్తంగా ఉండాలని నర్సాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి బాబు అన్నారు. మలేరియా మాసోత్సవంలో భాగంగా గురువారం నర్సాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మలేరియాపై అవగాహన కల్పించారు. వర్షాకాలం ఆరంభం కావడంతో దోమల వ్యాప్తి అధికమవుతుందన్నారు. వాటి కాటుకు గురైతే వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని వివరించారు. అందువల్ల ప్రతి ఒక్కరూ రాత్రిళ్లు నిద్రించే సమయంలో దోమతెరలు వాడాలని, ఇళ్ల కిటికీలకు జాలర్ వంటివి బిగించుకోవాలని సూచించారు. చలి, వణుకుతో కూడిన తీవ్ర జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వికారం, వాంతులు వంటి లక్షణాలు ఉంటే మలేరియా జ్వరంగా భావించి వైద్యులను సంప్రదించాలని సూచించారు.

జీవాలకు నట్టల నివారణ మందు


గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న సిబ్బంది

రుద్రవరం: గొర్రెలు, మేకలు ఆరోగ్యవంతగా ఉండేందుకు చెపట్టిన నట్టల నివారణ మందును కాపరులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు రమణయ్య అన్నారు. రుద్రవరంలో గురువారం నట్టల నివారణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అటవీ శాఖ కార్యాలయం వైపు ఉన్న గొర్రెలు, మేకల రైతు రమణయ్య ఇంటి వద్దకు వెళ్లి జీవాలకు మందు తాపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి పరిశ్రమను నమ్ముకుని జీవిస్తున్న రైతుల జీవనాభివృద్ధి చెందేందుకు నట్టల నివారణ కార్యక్రమం ప్రారంభించామని తెలిపారు. మందు తాపడం వల్ల గొర్రెలు, మేకల్లో ఎదుగుదల పెరగడంతో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం 15 రోజుల పాటు కొనసాగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ ఉన్నారు.

మహానందిలో ట్రాన్స్‌పోర్ట్ ఆర్‌జేసీ పూజలు


దర్శనార్థం వచ్చిన ఆర్‌జేటీసీ బసిరెడ్డి, అధికారులు

మహానంది: ఏపీ రవాణా శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ బసిరెడ్డి గురువారం మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

నూతన కమిటీ నియామకం

ఆళ్లగడ్డ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆళ్లగడ్డ మున్సిపల్ కమిటీని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించారు. వైస్ ప్రెసిడెంట్స్‌గా శివనాగిరెడ్డి, కాశీం, జనరల్ సెక్రటరీస్‌గా గోపాల్, జనార్దన్‌రెడ్డి, కిశోర్, నరసింహారెడ్డి, సెక్రటరీలుగా గురప్ప, అబ్బాస్, పుల్లయ్య, లక్ష్మినారాయణ, చక్రపాణిరెడ్డి, అల్లాబకాష్, నరేంద్రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాఘవేంద్ర నియామయం అయ్యారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వినోద్‌కుమార్, గురువయ్య, నాగేశ్వరరావు, చాంద్, చంద్ర, బషీర్, లక్ష్మయ్య, పాములేటి, బాలవెంకటసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి, సంజీవరాయుడు, శివశంకర్‌రెడ్డి, ఉసేనయ్య, హుసేన్‌వలి, సుదర్శన్‌రెడ్డి, మనోహర్, దామోదర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, ఉదయ్, రామిరెడ్డి, ఈశ్వరయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, షేక్ మస్తాన్, రాజారెడ్డిలను నియమించారు. ఈ సందర్భంగా వారు మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

రుద్రవరం: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. ఎస్ఐ వరప్రసాదు వివరాల మేరకు.. రుద్రవరానికి చెందిన సుబ్రమణ్యం(54) మద్యానికి బానిసై రోజు నగదు కోసం ఇంట్లో గొడవ పడేవారు. ఈ నెల 21న మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వమని ఇంట్లో వారిని అడిగాడు. వారు ఇవ్వకపోవడంతో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేద్దాం


వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న మతపెద్దలు

చాగలమర్రి: వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా కర్నూలు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఈ నెల 30న తలపెట్టిన ‘వక్ఫ్ బచావో–దస్తూర్ బచావో’ బహిరంగ సభను జయప్రదం చేయాలని అల్ ఖైర్ ట్రస్టు చైర్మన్ మౌలాన అబ్దుల్ మజీద్ ఆరీఫ్ పిలుపునిచ్చారు. గురువారం చాగలమర్రిలోని మర్కస్ మసీదులో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యులు, జేఏసీ సభ్యులు జాకీర్‌అహ్మద్, ఖలీల్ అహ్మద్, ముస్తఫా, తౌసీఫ్, హాఫీజ్, జావీద్ బాషా, మహమ్మద్ రఫీక్, ఇమాంలు సలాం, సులేమాన్, మతపెద్దలు పాల్గొన్నారు.


మాయలూరు సచివాలయానికి వెళ్లే రహదారిలో నిలిచిన మురుగు నీరు

మురుగు కష్టాలు

ఉయ్యాలవాడ: మండలంలోని మాయలూరు బీసీ కాలనీకి వెళ్లే రహదారులపై మురుగు నీరు పేరుకుపోయి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అటువైపు రైతు సేవా కేంద్రం, గ్రామ సచివాలయం, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఉన్నాయి. విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో సిమెంట్ రోడ్లు అయితే నిర్మించారు కానీ మురుగు నీరు వెళ్లేందుకు కాలువలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఇళ్ల నుంచి వదిలే వృథా నీరు, వర్షపు నీరు రోడ్లపై చేరి నిల్వ ఉంటున్నాయి. దుర్వాసన వెదజల్లుతూ దోమలకు నిలయంగా మారాయి. సమస్యను ఎన్నిసార్లు పంచాయతీ కార్యదర్శి, మండల స్థాయి అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.


బీసీ కాలనీలో..